# దొరా ! నన్ను అమ్ముకోకు

''ఇప్పుడు పరమేశం పురాగమారిండంట, ఎన్కటి శాస్త్రలు అసలే కండ్లవడ్త లేవంట. యిందాక సుట్టొముసురుకోని చెక్కభజన్లు జేసె భక్త్రాజులు కంట్ల కలికానికి కాన్రాకుండ వోయిన్రంట !'' వూరి మంది పెదువుల మీది తేనె మాటలు.

''పాపం ఎట్లబతుక్కతడొ ? ఎందో ? పెండ్లాం సీతమ్మ ధర్మదేవత, గుమ్మడి పండ్లోలె యిద్దరు పిల్లలు, వాళ్లను జూస్తె ఆకలి దూపలు వాస్తవిగని, ఎంతకాలందాంక ఆతల్లి యింటి గుట్టు బయలుగాకుండ కాపాడ్తది'' ? అంట కండ్లొత్తుకోని వూదుపొగ ఏసింది యింగో ఆరివారం గల్లతల్లి. కత మెల్ల మెల్లగ తీగెలు వారింది. పందిరి కెక్కింది .

పరమేశం అంటె ఏందో బక్కసిక్కిన బేగారి కుటింబపోడుగాడు. బాగ బత్కిన యింటి బిడ్డనె. వాళ్లది కొంచెం సంసారమా ? లంకంత కొంప, బండ్ల కొద్ది పాత్ర సామాను, గుమ్ములు, గాదెలు, పాడి, పంట, పసి, దొడ్లు, నౌకర్లు చాకర్లు. పూజ పునస్కారాలు, వచ్చిపొయ్యెటోళ్లు, సుట్టాలుపక్కాలు. అమ్మో ! మండిన పొయ్యిమండి నట్లె ఎత్తిన ఇస్తారి ఎత్తినట్లె ! వొండేచేతికి, వొడ్డిచ్చె గంటెకు నిలుకడవుంటె వొట్టు. అసొంటి సంసారంల సీతమ్మ శ్రావణ పట్టిగట్టుకోని కాపిరాని కొచ్చింది. ఈ జంటను జూసిఅందరు కండ్లు సల్లన గాంగ దీవెనార్తి యిచ్చిన్రు.

సీతమ్మ కాపిరానికొచ్చిన తొలినాళ్లల్ల యాడ ఐదారేండ్లు పరమేశం అచ్చెట ముచ్చెటంట, సుకంగ కుందునపు బొమ్మసొంటి సీతతోటి గడిపిండోలేదో గని అప్పుడే ఆయింట్ల ముసులం బుట్టినట్లు పరమేశానికి వోజతగాడు దాపురిచ్చిండు, వాణి జత గూః. పరమేశం యింటి సందున ఏదు కొయ్యలు పెట్టినట్లు యింతింత పెండ్లానికి దూఃమైండు.

ఈ జతగాణ్ణి గూడినప్పటి నుండి పరమేశం వూరి బంగులాల వుండుడే లేదు. రయిః రయిః వంట వొకటే తిరుగుడు. తెల్లారిందంటె ఆత్రమాత్రం అంట

బసెక్కా పట్నంబోను, మళ్ల ఎప్పుడో సెరిసగం రాత్రికి వచ్చుకం అలు వాటైంది. పాపం సీతమ్మ పరమేశం కోసం కండ్లు కాయలు గాసెటట్ల ఎదిరి సూస్కుంట, నాయిన గావాల్నంట ధూంజేస్తున్న పిల్లలను బుజ్జగిచ్చి బువ్వవెట్టి జోకొట్టి పండుకోవెట్టేది. పిల్లలు నిద్రల జొచ్చినంక తాను మొగణికి వుడుకు వుండాల్నంట వంటుకాలను ఎచ్చ వెట్టుడు, దించుడు సీమ సిటుక్కు మంటె వచ్చిండంట వులిక్కి పడుడు తోటి సరిపోయేది.

ఇట్ల వో నెలదినాలు గడ్సినయి.

ఇంతట్లకె ఆ దోస్తు 'రమేశ్! దినాం నీకీ బస్సుపయినమెందుకు? ఖదరు తక్కువ వో యిస్కూటరు గొనరాదు ' అంట, తియ్యటి తీపులొలుకంగ యిస్కూటరు గొనిపిచ్చిండు. ఆ జానీ దోస్తు.

పరమేశం యింట్ల ఎప్పుడు పుట్ల కొద్ది ధాన్యం దంగుతుంటది. పరమేశం అప్పుడప్పుడు నిగురానిగ నిలవడ్తుంటడు. ఏందో వో నాడు తుర్తుల పని వున్నట్ల యింటికొచ్చిన ఆ దోస్తు దంపుకాల కాడ పెద్ద పటేలోలె నిగురానీ జేస్తున్న పరమేశాన్ని జూసి 'ఇదేందిర ? పరమేశ్! ఇంట్ల యీ దంపుకాలు, యిసుర్కాలు ఏందిర ? తాతల తీర్గ ? వో అల్లరి గొనరాదు ? యీ జంజాట్కంలేకుండ '' అన్నడు.

నోట్లమాట నోట్ల వుండంగనె రొండెడ్ల పెద్ద బండిల 'అల్లరు' వొచ్చి బంగులక మూన్నల్లనిలవడ్డది. పెద్ద గుమాస్త కొబ్బెరికాయ గొట్టిండు, పరమేశం బిసదిప్పి మిషన్ చాలు జేసిండు. ఇంట్ల యిప్పుడు రోళ్లు, కుందెన్లు, రోకండ్లు, దంపుకాలు, పొతాలుగిట్ల లేవు. ఈ అల్లరి వొచ్చినంక పరమేశానికి గిట్టువాటు గుడ బాగనె కండ్లవడ్డది. సీతమ్మకు గుడ జెరవూపరి సల్పినట్లైంది. దోస్తుదిక్కు యింగింత వాలింది పరమేశం మనసు.

కొంచెం ఇడువాటు దొర్కినంక సీతమ్మ ముప్పొద్దులు దిని వూకెకూర్కపొట్లు వడుకుంట కూసునుడు ఎందుకంట ? వో అయ్యవారిని పిలిపిచ్చుకోని భారత రామాయణాలు సదువుకం మొదలు వెట్టింది. సీతాకళ్యాణం సదివెటప్పుడు శ్రీరామ చంద్రమూర్తి ఎత్తూ పొడుగు, కన్నూముక్కుతీరు వర్ణన రాంగ ఆపోవడి అంట, తన ఎదమెచ్చిన పరమేశమే అనుకోని సిగ్గుముంచుక రాంగ, కొంగు నిండుగ సవురిచ్చుకునేది. ఇంతటి తేనె తీపులల్ల తడుసుకుంట ఏ యికారం లేకుండ రాత్రిళ్లు మొగణి రాకడ కోసం సూపుల తోరణాలు గట్టంగ పడిగాపులు కాసేది.

సీతారాముల శృంగారం తనమనుసుల జొచ్చి, తన లోపట దాసుకున్న శృంగార తంత్రిని మీటిన కాణ్ణుండి ఏందో ? కోరిక తనను కదిలిచ్చుడు మొదలు వెట్టింది, యింగ ఆ యాళ్లరాత్రి ఎప్పటి తీర్గ అర్ధమ్మ రాత్రికి వొచ్చి పడ్కటింట నిద్ర వోతుండడు. అట్ల మత్తుగ నిద్రవోతున్న మొగణ్ణి చూసి తాకబుద్దై సీతలేసి ఆడ్కివోయి పక్కల గూసోని సుతారంగ ఆయిన చెంపకు చెంప ఆనిచ్చింది. అట్ల ఆనిచ్చుడే తడువు, చెంపమీద చెళ్లున సర్సినట్ల, ఎదమీద నిప్పుకలు సల్లినట్ల, పాలపొంగుమీద నీళ్ల సల్లినట్ల గప్పున సార వాసన గొట్టింది. దాంతోటి ఏటువడ్డ జింకపిల్లోలె, వురుక్కొచ్చి మొదలు నర్కిన సెట్టోలె, మంచాన గూలింది, ఎంత కుమిలిందో ? ఎంత ఎతపాలైందో ? ఎన్ని కండ్ల నీళ్లొలికిందో ? తెలువదు .గని ఈ రాత్రి సంగతి యాది దెల్వని పరమేశం మట్కు పొద్దున లేసి మామూలుగనె మెసిలిండు. గని సీత మట్కు పురాగ మారినట్ల ఎద, రాయి జేస్కోని సంసారం జేయవట్టింది. ఆకాణ్ణుండి రాత్రి యి స్కూటరు సప్పుడిన్నా కదిలేది గాదు. మొగణి రాకకోసం నిద్రగాసి అన్నం దినకుండ ఎదిరి సూస్కుం మానింది, అదేందొ అంటే అంటనట్ల బైరాగి తీర్గమెసులు తుండది.

మీదికి మట్కు పరమేశం యిల్లు పెరుగు తున్నట్ల కండ్లవడుతుండదిగని మనిషి యింతకింతకు వూబిల దిగవడి పోతుండడు. ఇప్పుడు అల్లరు వోయి పెద్దమిల్లేవొచ్చింది దాని ఖరీదు కిందికి వూరెన్క పాలంల వున్న చింతల తోపుకు నీళ్ల యిడ్వాల్సి వొచ్చింది.

ఇప్పుడు పరమేశం దోతి గట్టడు. పాయింటు, షర్టు దొడుక్కోని అంగిరీజు దొరోల్నె వుంటడు. ఆ పోషాకుల కన్ను మెచ్చె కామయ్య తీర్గకండ్లవడ్తున్న మొగణ్ణి వోగడిసేపు కన్నార్ప కుండ జూసి మొగణి కన్ను తన దిక్కువాలంగనె కండ్లు కిందికి దించుకోని నిలవడ్డది సీత. ఆసంగతి దెల్సుకున్న పరమేశం ఏమనుకన్నడో ? ఏందో గని, సన్న నగు కండ్లల్ల మెరుపులు జూపంగ ఎన్కటి రూపు ఏర్పడ్డట్ల సీతను జూసి 'పా ! అన్నం వొడ్డిత్తువంట సెయి వట్టుకున్నడు. తన బుజాల కిందికెళ్లి యీపును జుట్టు కున్న ఆ చేయి తాకుడు బిజిలి కరంటోలె తాకంగ సీత పెయ్యి ముల్లేసి జల్లుమన్నది.

ఎన్కటి తప్పిదాలన్ని మర్శి సీత మొగణికి వొడ్డన జేసింది. అప్పుడు పరమేశం 'నీవూ రారా ! కల్సి తిందాం ' అన్నడు. ఆ మాటలు యిని సీతమ్మకు ఎన్నాళ్లైందొ ? ఎదల తీపి ఎక్కువైనప్పుడు సీతను అట్ల పిల్సుడు పరమేశానికి అలువాటు. ఆమాటలు

యిన్న సీతసెవుల్ల పన్నీరు గుర్సినట్ల గాంగ యిందాకటి గుర్రంత సెగకు గర్గిన ఎన్నోలె పారంగ కండ్ల నీళ్లు నిండుకున్నయి. అప్పుడు ఆ రొండు కండ్లు పూదేనెల తేలుతున్న గండు ఈఁమ్మెదలోలె కండ్ల వడ వట్టినయి. ఆసొగసు జూసిన పరమేశం యింగింత ప్రాణ వార్తికం తోటి సీతను మరింత దగ్గరికి గుంజుకోని పళ్లెంల వున్న పూరీని గుండుగ జుట్టి తన నోటితోటి సీతనోటికి అందిచ్చిండు. సీత, పరమేశం రొండు చెంపలు గట్టిగవట్టి దూరం జర్పి నట్ల జేస్కుంటనె పూరి వుడ్తను అందుకున్నది. పూవుటమ్ముల మనగాడు సింగిణి సవరిచ్చుకోవట్టిండు. ఎన్నాళ్ల కెన్నాళ్ల కంట వీరిట్ల దగ్గరైతుండంగ, శనేశ్వరుని తీర్గ అవుతల 'పయిం పయిం' అంట మోటరు హారన్ గొట్టిన సప్పుడు యినొచ్చింది. ఆ సప్పుడు చెవుల వడేదివడంగనె పరమేశం అన్ని మర్సి ఏందొ ? గాలి సోకినట్ల, 'యిప్పుడెవొస్త' అంట తట్లనె సేయిగడ్గి కడ్ప దాటిండు.

సీత ఏడ్వలేదు, ఇందాక నిండుకొన్ననీళ్లు వాటిచ్చ అవేయింకి పోయినయ్. గాయ పడ్డ ఎదపుండు యింగా పచ్చి ఆరకముందే మళ్లా ఆతావున్నే యింగో దెబ్బ తగులంగ కట్టిన పక్కూడి పచ్చినెత్తురు జొటజొట వొలికింది.

ఇంట్ల సీతమ్మగతి యిట్ల పాడు గొట్టుకపోతుంటె. ఆవల పెద్దదరువాజ ముంగల నీలిమకుమలు సింగారిచ్చిన అంబారి ఏనుగోలె వొచ్చి కొత్తమోటారు నిలవడ్డది. అమోటార్ల కెళ్లే పరమేశం దోస్తు 'అరే ! పరం ! సూడురా ! జెర ! నీ డిరీం గర్లును, ఎన్నెన్ని సోకుల తోటి సింగా రిచ్చుకున్నదొ ? సూడు ! ఇప్పుడొచ్చిందిరా ! నీ దేవుడీకి కళ ! ఇంగ జూస్కొ నీతడాక' అంట మోటరు దండుకం సదువుతుంటె యిల్లుకు యిల్లు కదిలొచ్చినట్ల వొచ్చి కొత్త కోడల్ని జూసినట్ల జూడవట్టిన్రు. పాపం పనోళ్లు తాకి, ముట్టుకోని, సుట్టుదిరిగి అపురూపంగ జూసిన్రు. కొబ్బరికాయగొట్టి మంగళారతి యిచ్చిన్రు.

ఎంతప్రాణానికి ప్రాణమంట మెసిల్నగని ఈ దోస్తు కండ్లల్ల వడుకుండ పరమేశం సీతను దూరంగనె వుంచిండు. ఆమె పర్దదాటి ఈవలికి రాదు. అందికె తన యిద్దరి చెండ్లను మోటారు ఎక్కిచ్చు కోని తన పెద్దబాయి దాంకపోయి వొచ్చిన్రు. కారు పైకం కిందికి మోట బాయిని ఆబ్కారీ గుత్తెదార్లు మస్తాన్ సాబూ, సింగోటాలు పంచు కున్నరు, బావులూ, పాలాలు హారతి కర్పూరమోలె కర్గిపోవట్టినవి.

పరమేశం ఇంట్ల యిన్నాళ్లు బోజినాలు ఇస్తాళ్లల్లనె జరిగేవి. ఎప్పుడన్నమోతేబరి

పెద్దలు, సుట్టాలుగిన వొస్తె సీతతల్లిగారిచ్చిన ఎండికంచాలల్ల వొడ్డన జరిగేది. ఇప్పుడు బోజనాల అరల టేబిల్ కుర్సీలొచ్చినయ్. వొడ్డెన గిన్నెలకు బదులు సీను గాజు చిప్పలూ ,గాజు పిలేట్లు, కాంటలు, కత్తులు, చెమ్చెలు వొచ్చినయి. టేబిలి మీదికి దుప్పటోలె వర్సె టందుకు పిలాస్టిక్ బట్టగుడ్డలొచ్చినయి, గాజుసామాను వాడ్కం అలువాటు లేని పని పాటలోళ్ల దబిక్కు, పుటుక్కు మంట ఎత్తేసి పలగొట్టి ఖరీదైన వస్తువ లన్నిటిని బోకి పెంచికలకన్న అన్యాలంగ పెంటపాలు జేస్తుండరు. అయినా సీత యాది వట్టిచ్చుకుంట లేదు. తానుమట్టుకు ఎప్పటి తీర్గ యాళ్లదప్పక అమ్మవారికి నివేదిచ్చి ఎండి తట్లనె బోజినం జేస్తుండేది. ఇవి జాలవన్నట్లు, యింట్లకు వో బరఫ్ మిషనూ, చిన్నసినిమా మిషనూ, వోరేడియా అన్నివొచ్చినయి.

ఇట్ల యిన్ని కొత్త కొత్త కరామతులు ఇంట్ల సోటు జేస్కోంగ పల్లెకు పల్లె 'అబ్బో! అంటె బొబ్బ అనుకుంట యింటి సుట్టు జేరవట్టిన్రు. తమాసజాతమంట.

మన పరమేశం ఇప్పుడు కండ్లకు నల్లద్దాలు వెట్టి చేతుల ఛెడివట్ట నేర్సిండు. ఎన్కటోలె పొద్దటిపూట పలారంల వుప్పిడివిండి, పూరి, గారె, ఎన్న-ఎల్లిపాయెకారం బెట్టుకోని అట్లు గిన దినడు. గుడ్లు ఎచ్చిపచ్చిగ అప్పవోపిచ్చుకోని డబల్‌రొట్టె ముక్కల నడ్మవెట్టుకోని ముద్ద ఎన్న గొరుక్కుంట ముండ్ల కాంటల తోటి తంటాలు వడుకుంట తింటుండడు. పాలు మట్కు తాగుతడు. టేబిలి కాణ్నుండి లేసే ముంగల సీతపాలగిలాస దెచ్చి పెడ్తది. ఆపాలను వొద్దనే దైర్నం ఇంగా పరమేశానికి రాలేదు. అందుకని ఆపాలు వొద్దనకుండ తాగుతడు.

ఈ అలువాటు ఆలు మొగుండ్ల అనురాగపు బందానికి గట్టి ముడేస్తుండదని కపుట వాజి దోస్తు ''ఏరా ? పరం ! యింగా సంటోని తర్గ పాలుదాగుడు ' అంట ఎక్కిరిచ్చిన గని

'పోనిరా ! ఆ పాలన్న తాగకపోతె మీచెల్లెలు చిన్నవుచ్చు కుంటదిరా ! అన్నడు పరమేశం సీతను నీ చెల్లెలు అన్నమాట యినంగనె ఆ దోస్తుకు ఎకాఎకిన చెముటలు వుట్టుకొచ్చినంత పనిగాంగ 'పరం పా ! పోదం అవుతల జరూరు పనులుండవి అంట మాట దప్పిచ్చి తొందరవెట్టి పరమేశాన్ని దోల్కని మోటరెక్కి రయిఁ మంట వోయిన్రు.

మోటరొచ్చిన యాళ్లనో ? పుణ్యమోగని, రోడ్లమరమత్తు, చెరువుకట్ట గుత్త

పరమేశానకి దొర్కింది. చేతులున్న పనాయె, ఇంగ డాంబరు సడాకు పట్నం జిల్లా, తాలుకా కస్బా దాటుకుంట సక్కగ పరమేశం వూరు గుడికుప్ప కాడికొచ్చింది. వో! ఇంగ గుడి కుప్పవొయ్యారం సెప్పతరం గాదు. వూళ్లమందిని పల్కరిచ్చెటట్లెలేదు.

ఆ నాడేందొసంబురం? వో పెండ్లి ప్రవోజినం వోలె గండ్లవడ్తుండది. ఒగణ్ణి 'కో' అంట విలిస్తె వో అంట పది మందొచ్చి పనులు అందుకుంటుండరు.

ఆయనూళ్లనె 'గుడికుప్ప' దాంక వడ్డ కొత్త రోడ్డుకు తెరదీసి దానిమీదంగ పెద్ద మినస్టరయ్య పెద్దకార్ల గూసుండొచ్చి ఈ రోడ్డు మీద, రాక ఫోకలకు 'శ్రీమా' అంట ప్రారంబోత్సవం జేసి 'రిబ్బెన' కత్తిరిస్తడంట 'ఇంగవొచ్చెటోడు పెద్ద మంత్రాయె. ఒక్కడొస్తాడు? ఎంట సిబ్బంది ఎందరుండరు? వాండ్లే గాక ఫోటు గిరాఫర్లు, పత్రికలోండ్లు, పూలు జల్లి, హారతియ్య సీనిమ్మ బొమ్మలసొంటి ఆడివిల్లలు, రేడియా, టి.వి.ల మంది వో మస్తుదిగుతరంట' అనుకుంట జనం గుంపులు గట్టినిల వడ్తుండరు. ఇంగ వొచ్చెటోండ్లకు బోజినాల కోసం పరమేశం యింటెన్క మామిడి తోపు ల్లనె వంటుకాల ఏర్పాట్లు జర్గుతుండవి. ఆ పక్వాన్నాల వాసన సుట్టుపక్కలున్న మంది ముక్కులు జొచ్చింది, గాక, నాల్కెదాకి, నోట్ల నీళ్లూరిస్తుండయి.

ఇట్ల జరిపె సర్వరాయిాల తయ్యారి జర్గుతుండంగనె జరపొద్దు వాలుతుండంగ పాపం మాట దప్పకుండ మినిష్టరొచ్చిండు. సబమొదలైంది. వో ఆడివిల్లొచ్చి పూల దండ దెచ్చి యి స్టేజిమీద గూసున్న మినిష్టరయ్య మెల్లేసి, దండ సవరిచ్చినట్ల సుకాసి సేతులొట్టి ఎద దాకింది. పాపం బొద్దుగ, గుండుగ వున్న మినిష్టరయ్యకు ఏందోసక పక్కల గూసున్న పరమేశం మీదికెల్లి వొంగి ఏందో ముచ్చెట జెప్పుతున్నట్ల దస్తి దీసి పణ మీద చెముటలు తుడ్సుకోని ఎడ్డిమొకం బెట్టి ఎన్కకు జూసిండు. ఆణ్ణే పక్కపొంటి నిలువు దీపెమోలెనిలవడ్డ పి.యె.సాబు జీహుజూర్ 'అంట తననువిల్సినట్లుంది. ఆ పనేందొ? తెల్సుకుందం' అని సార్! అన్నడు.

ఆమాటతోటి మల్ల తన లోకంల వడ్డ మంత్రిగారు ''సూడు పి.యె. గుడికుప్ప వుందికి ఏంగావాల్నో రాసుకో! అన్నడు. పరమేశం దోస్తు తన మంత్రం పురాగ పారతుండదని కుసివడవట్టిండు. సబ ముగిసింది.

బోజినాలకోసం అందరు దళ్లల్లకు నడ్సిన్రు. ఆ వంటకాల రుచి సువాసన, సుబ్రత అన్ని మెచ్చుకోలుగనే వున్నయి. వుండవా మరి? ఇవన్ని సీత సొతాగ ఏయాల్సిన

ఎచ్చాలు పాళ్ళు గల్పి సూపిందాయె. తిన్నంతసేపు పెద్దపెద్ద ఎత్తులంత రచులు పొగుడు కుంటనె దిన్నరు. తాంబూలాలు తీసుకున్నరు. ఈ సందట్ల పరమేశం దోస్తు మెల్లెగ పరమేశం పక్కనవిలవడి 'ఇంగోరోడ్డు గుత్తపని ఖాయంరా! అంట చెవులవూదిండు. పరమేశానికి పట్టలేనంత కుసి అయింది. అందరు ఎంట నడువంగ మినిష్టరయ్య పొయ్యేస్తనంట మోటరెక్కిండు. సుట్టు కున్నోళ్లంత బయ బక్తుల తోటి దండాలు వెట్టిన్రు. మినిష్టరు పరమేశం దోస్తు చేతుల సేయిగల్పి, పరమేశాన్ని దగ్గరకి రమ్మంట సైగ జేసి, మోటరు అద్దం మీదికెత్తిచ్చి 'సూడుపరమేశం నీవు అదృష్టవంతునివి. సీతమ్మ నీకు పెండ్లమైంది. ఆతల్లి అసొంటి చేదోడు వుండంగ నీకేం కొదువయ్యా! అన్ని ఏర్పాట్లు బందవస్తుగనె నడ్సినవి' అంట ఈపు మీద సెయ్యేసి సెబాసులు వలికిండు. మోటారు గదిలింది. మిగులు వడ్డోండ్లకు తిండి తిప్పలు జూస్కుంల మునిగిపోయిండు పరమేశం.

ఈనడుంగుల దోస్తు కోసం ఎతికిండు గని అదోస్తు కాన్రాలేదు. ఏందో? వాడు ఇంగే కొత్త ఎత్తుకు రూపు దిద్దుతుండడో? యాపనిల మునిగిండొ? ఇద్దరం గలిసే తింటం, పాపం వాడే లేకుంటె యింత ఎదుగుదల నాకబ్బేదేనా? మా గుడికుప్ప కలల గూడ జూడని చముత్కారమోలె అంతంత అఫ్సర్లు మినిష్టరు ఈడ్కివచ్చుడు వడేది గిట్టన? అంట అనుకుంటుండంగనె

పాపం పెండ్లాం సీత గుర్తుకొచ్చింది. ఆమె అట్ల మనుసుల మెదులంగనె తానెందో తప్పిదం జేస్తున్నట్లు నిపిచ్చింది. ఈయాళ్లతోటి, ఏందో యిదంత గంపెడు ఆశతోటి ముందుకు వుర్కుడు బందు జేసి యింటిపట్టునుండాలె, ఆశకు అంతాండది? అంట నిర్ణయిచ్చుకోని యీ పూట సీతానేను గల్సే బోజినం జేస్తం అంట మిగులు వాటు పనులు చేతికిందోళ్లకు వొప్పజెప్పి, తన దోస్తును ఈణ్ణె భోజినం జేయ మనుండి అనుకుంట ఇంట్లకు బాటవట్టిండు. పరమేశం అట్ల దిడ్డి తలుపుల కెళ్లి ఇంట్లకు కాలు వెట్టంగనె ఆడ పరమేశం దోస్తుగొంతు యినిపిస్తుండది.

ఎవ్వరి పనులల్ల వాళ్లుండుడు జూసిన దోస్తు మనుసు ఆగవట్టుకోలేక బిరాబిర సీతకాడి కొచ్చి 'సీతా! ప్లీజ్! నన్ను కాదనకు. నీసొగుసుకు దాసుడను, నీ పెండ్లిల్ల నిన్ను జూసిన కాణ్ణుంచి నా మనుస్సు నిన్ను దగిలి నీ ఎంటనె తిర్గుతుండది. ఈ చముత్కార నాట్కమంత నీ మొగణ్ణి ఏడు తాళ్ల లోతున ముంచి నిన్ను దక్కిచ్చు కునెటందికె

పన్నిన, కాదనకు. వాడు నేను లేంది. దినం గడవువని స్థితిల గూలిండు. ఇదంత నీ సుకం, నీ మేలు కోసమే జేసిన, అంట చేయివట్టుకున్నడు.

ఆ క్షణంలనె వొచ్చిన పరమేశం వుగ్రంతోటి యింగింత ఎత్తు పొంగుతుండంగ మొగణ్ణి జూసిన సీత తన సేయి వట్టిన ఆ దోస్తును గజ్జికుక్కను సూసి సీదరిచ్చు కున్నట్లు, పురుగును దుల్పరిచ్చినట్లు, దుల్పరిచ్చి నీకెంత దైర్నంరా? అనుకుంట యిడి పిచ్చుకోని బాణవెోలెవొచ్చి పరమేశాన్ని అల్కుకుంట ''దొరా ! నన్నుగూడ అమ్ముకోకు '' అన్నది. విషమోలే వొచ్చి తాకిన ఆ మాటను మింగి, ఆడున్న దోస్తును నిప్పులొలుకుతున్న చూపు జూసిండు . ఆ సూపును తట్టుకోలేని దోస్తు జారుకున్నడు.

'సీతా ! నా ప్రాణం ! నా ఇంటి ఖదరూ ! నా పిల్లల తల్లీ ! చచ్చినపామును కొట్టకు' అంట లోపటికి సీతను దోల్కోని నడ్సిండు. మొగలు మీద సందమామ, సీత మంచాన మల్లెపూలు ఇర బూసి నగినయ్.